

కథా కౌముది

# తామరపాకు - కన్నీటిబొట్టు

నవులూరి వెంకటేశ్వర రావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో బహుమతి పొందిన కథ

ఐదున్నర అడుగుల ఎత్తు; తెలుపుకు తిరుగుతున్న పలచటి ఉంగరాల జుట్టు, చింపిరిగా అందంగా తెల్లబడుతున్న చంపలు; విశాలమైన ఛాతీ. అతని యాభై ఏళ్ళ వయసు ఆకర్షణీయతకు చోటునివ్వడం మానలేదు. డచ్ లే–అవుట్ అని పిలువబడే సముద్రానికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో అతని చెక్కుడురాళ్ల ఒంటిస్తంభం మేడుంది.

ఒకప్పుడు వాళ్ళది ఉమ్మడి కుటుంబం. విశాలమైన వారసత్వ పురాతన భవనంలో పాతపట్నంలో ఐదు కుటుంబాలుండేవి. అదొక నిరంతర జీవిత తుపానుల సంద్రం. జీవితం మీద విరక్తి కలిగించే అనేకానేక అనుభవాలు. ఆ కల్లోల ఉమ్మడి జీవితం మధ్యలో ఏకాంతానికి అలవాటుపడ్డాడు. ఇష్టపడే మనుషులతోనైనా భుజం భుజం రాసుకుంటూ గడిపే జీవితం జుగుప్సాకరమే అని అది నేర్పింది. ఆ ఉమ్మడి కుటుంబ చిత్రంలో – పుట్టుకలూ చావులు, రోగాలూ రొష్టులూ, ఏడుపులూ నవ్వులు, వావీ వరుసలు లేని శృంగారాలూ, అర్థరాత్రి మూలుగులు, స్వల్ప విషయాలకూ ద్వేషాలూ స్వార్థాలు, అనుబంధాలు, పొగర్లు, వాగ్వాదాలు, అనవసర పోటీలు, కుతంత్రాలు అనేకం. మరో జీవి ద్వారాగాని ఇంకోలాగాని తన వారసత్వపు ఆనవాళ్లు మిగిలి ఉండరాదని నిషేధించుకున్నాడు! చదువు పూర్తి చేసుకుని తనవంతు ఆస్తిని తీసేసుకుని సొంత జీవితాన్ని ఆరంభించాడు. ఉద్యోగం చేయ దలచలేదు.

కొన్ని సంవత్సరాల ఆలోచన, జుగుప్స కలిగించిన జీవితానుభవ జ్ఞానం లేక అజ్ఞానం అతను ఏర్పరచుకున్న జీవితవిధానానికి పునాది రాయి. దానికి నైతికతతో, అనైతికతో, చివరకు మానవత్వంతో కూడా తక్కువ ప్రమేయముంది.

పశువు, క్రిమికీటకాలు, పక్షులు, జలచరాలూ – ప్రతి జీవి సుఖానికై వెంపర్లాడేవే. ఇలాంటి జీవితమయితే తనకు సుఖాన్నిస్తుందనుకున్నాడు! ప్రవృత్తి అయినపుడు ఒంటరిగా జీవించడం సాధ్యమే. "సోమరితనం అద్భుతమయినది – తపస్సులా, తమస్సులా." అసాధారణ జీవిత ఎంపికను అప్పుడప్పుడు అతను సమర్థించుకోవడం అవసరం.

అడపాదడపా కొందరు స్త్రీలతో సంబంధాలుంటూ వచ్చాయి. ఎవరినీ తన ఇంట్లో ఉండనీయలేదు. ఆ అవసరం ఉందని అతనికి అనిపించలేదు. మానసికంగా కూడా ఒక స్త్రీ అవసరం లైంగికావసరాన్ని మించి తనకు ఉందని అనిపించకుండా జాగ్రత్త పడ్డాడు.

భ్రమరాంబ ఒకరోజు వచ్చింది. ఆమెతో ముఖ పరిచయం లేదు. ఐదు నిమిషాలు ఆలోచించి, "పంపు" అన్నాడు బాలయ్యతో. సముద్రం వైపు తిరిగి కూర్చుని ఆమె గురించి ఎదురు చూశాడు. అడుగుల చప్పుళ్లు చేసుకుంటూ వచ్చి వెనుక నిలబడ్డది. "వెళ్లి ఆ సోఫాలో కూర్చోండి." కూర్చున్నదని నిర్ధారణ చేసుకున్న తరువాత "మాట్లాడండి," అన్నాడు. లుంగచుట్టుకుపోయి కూర్చుంది వాడిపోతున్న చంపకంలానూ; ఏదో దాచుకుంటున్నట్లు. తానేవిధంగా బంధువో చెప్పింది. రాబందువు అక్కడ వాలినట్లు ఉలిక్కిపడ్డాడు. "శుష్కేనీరే కః కాసారః క్షీణే విత్తే కః పరిహాహః : సంపదపోతే బంధువులూ వదిలేస్తారు. వాళ్ళు వొదిలేస్తే నష్టం ఏమిటి నిజానికి? సహాయం చేసే వాళ్లుండరని అర్థం. సంపద ఉండగానే నేనే వాళ్ళను వదిలేశా," అన్నాడు కటువుగా.

ఒచ్చినామెకు నలభై నలభై ఐదు సంవత్సరాల వయసు ఉండొచ్చు. మొహాన బొట్టులేదు. విశాలమైన ఫాలభాగం. అందమైన ఛాయ. చనుకట్టు ఆనవాలు తెలియకుండా కప్పి ఉంచింది. ఒదులుగా అల్లి వదిలేసిన దళసరి జడను భుజం మీదినించి ముందుకేసుకుంది దాన్నిమాత్రం చూపదలచుకున్నట్టు. ఉరేసుకోవాలనిపించే తాడులా, కామపాశంలా ఉంది. మేనకను చూడదలచుకోని విశ్వామిత్రుడిలా సముద్రం వైపు తలతిప్పాడు. తన గాథను దీనంగా అనర్గళంగా చెప్పుకొచ్చింది. సంతలో వస్తువు చరిత్రాయోగ్యతల గురించి అమ్మేవాడు చెప్పుకోటం అతనికి గుర్తుకొచ్చింది.

"ఐతే ఏమిటంటారు?"

అసలు విషయాన్ని ఎలా చెప్పాలా అని మరోసారి ఆలోచించింది భ్రమరాంబ. బతుకు సమస్యైనపుడు సిగ్గును చిదిమేసుకోక తప్పదు.

"మీ ఇంట్లో పనిమనిషిగానైనా ఉండి అవసరాలు తీర్చుతాను."

"ఇంటికి సరిపడా పనిమనిషులున్నారు. పిలిస్తే పలకడానికి బాలయ్య ఎలానూ వున్నాడు. లోకంలో చాలామంది దయనీయ పరిస్థితిలో వున్నారు. వాళ్ళు మరొకరి మీద ఆధారపడి జీవించాలనుకోక వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడాలి."

విల్లుల కింది నుంచి చూపుల పూలను సంధించి పరీక్షించింది. ఆమెతో తనకుగల సంబంధం ఒక బంధుత్వం పేరు. 'బంధుత్వం, రాబందుత్వం' ... హ హ హ. ఏనాడూ ఆమెను చూసివుండలేదు. ఆమె తనదగ్గిరికి రావడంలోనే కాక, ఒక చిత్రమైన పనిని నెత్తికెత్తుకుని వచ్చింది. ఒక స్త్రీ సాధారణంగా చేయలేనిది. తనపై తనకు అతి విశ్వాసం ఉన్నట్టుంది.

మొసలికి మానవత్వం అర్థం ఒహటే! తామరాకుపై నీటి బొట్టులా జీవిద్దామనుకుందా? అది అత్యాశని ఆమెకు తెలుసని ఆమెమాటల నైపుణ్యాన్నిగమనిస్తే అనిపించకపోదు. తనను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నది తనకు వీలున్నవిధంగా. అంతా తమాషాలా కనిపించింది. అతనిలో ఉద్రేకం తన్నుకొచ్చి సాధ్యమైనంతవరకు అణుచుకున్నాడు. అతను వేరే మనిషితో ఎక్కువగా మాట్లాడి చాలాకాలమవడం వలన సంభాషణను తుంచి ఆమెను పంపించెయ్యాలనిపించలేదు.

"ఒంటరి పురుషుడితో ఒకే ఇంట్లో గడపడానికి – యెంత జరుగుబాటు లేకపోయినా – ఇతర మార్గాలు లేనట్లు రావడంలో అసహజత్వం కనిపిస్తోంది. అసహజత్వాలను సహజత్వాలుగా నాగరిక ప్రపంచం తీసుకుంటోంది; దాని లక్షణాలలో అదొకటి. ఇలాంటి పనిని దిగజారుడుతనంగా ఎవరన్నా ఇంకా భావిస్తుంటే వాళ్ళను తప్పుపట్టాలేమో. నేను లోకాతీతమైన వ్యక్తిని. 'నళినీదళ గత జలమతి తరళం' అన్నపుడు జలం గురించీ ఆలోచిస్తామేగాని నళినీదళ స్వభావం మీదికి మనసు అంతగాపోదు."

తాను చెప్పింది ఆమెకు అర్థమైందా?

"ఎవరు ఏమనుకుంటారో అని భయపడటంకన్నా బతుకుదెరువు గురించి వెంపర్లాడటం ముఖ్యం కదా, సార్?" తల ఒంచుకుని గాలి వీచికకు అల్లాడిన ముంగురులు సవరినిచుకుంటూ అనింది.

"ఉన్నది జానెడు పొట్ట. మరో పనేదో చేసుకుని బతకటం ఈ విశాల ప్రపంచంలో అసాధ్యమా?" పవిట అడ్డని ఆమె పొత్తికడుపును చూస్తూ అన్నాడు.

"మీరన్నది నిజం. పడుపు వృత్తితో సహా ఎన్నో ఉన్నాయి. ఏ శరీర పోషణార్థం తాపత్రియ పడుతున్నానో ఆ శరీరం పడుపువృత్తికి సహాయకారే. పడుపువృత్తి వ్యాపారం; బిక్ష అడుక్కోడం, వెయ్యడం కాదు. ఉన్నంతలో మెరుగైన అవకాశానికి ప్రయత్నం చెయ్యడం దురాశేమో! ముగ్ధలా, మొగ్గలా, ముచ్చట గొలిపేలా జడ ముందుకేసుకుని కూర్చుంది. మేనుకు మెత్తటి వేళ్ళు కితకితలు పెట్టినట్టయిందతనికి. స్త్రీ ప్రతి భంగిమలో కళవుంటుంది అనుకున్నాడు.

"నా గురించీ మాత్రమే నేను జీవిస్తున్నా. ఇలాంటి జీవితమంటే నాకు ప్రేమ లేదనిగాని, ఉందనిగాని అనుకోను. జీవితం నచ్చినా నచ్చకపోయినా జీవించక తప్పదు. నేను మనుషుల మధ్య జీవిస్తున్నానంటే అది తప్పనిసరై. ఇతరుల అవసరం తీర్చడానికి నేను లేను."

అవమానించబడిన అడుక్కుతినే మనిషిలా తనను తాను భావించుకుంది. అతనున్న పరిస్థితిలో ఈ విషయం అతనికి ఒకలాను, తానున్న దయనీయ పరిస్థితిలో తనకు ఒకలాను అనిపిస్తుంది. అతనన్నట్టు నిజంగానే తాను చేయబోయిన పని అసంగతం. మరో మార్గం ఉండకపోదు. తాను కొన్ని ప్రయత్నాలు చెయ్యాలి; వాటిలో ఇదొకటి. మంచీచెడుల మీమాంస చేసి నిర్ణయం తీసుకోగల పరిస్థితిలో తానులేదు. తమకు కావలసిన జీవిత విధానాన్ని ఎంపిక

చేసుకునే వీలు కొందరికే ఉంటుంది, అతనిలాంటి వాళ్లకు. ఎలాగో ఒకలా జీవిద్దాము అనుకునే స్థాయి కొందరిది, తనలాంటి వారిది.

ఒక్కోసారి గొంతు గద్గదం అయింది. కన్నీటితో తడవని చరిత్ర ఏ మానవుడిదీ? మూడొంతులు సముద్రం ఆక్రమించివున్న చోట తేమకు కొదవా? ఆమె తీయని స్వరం హోమర్ ఆడైసి [Odyssey] లోని మాయ పాటగత్తెలు సైరెన్స్ స్వరంలా తోచి తనను తాను హెచ్చరించుకున్నాడు.

“కావలిస్తే కొన్నిరోజుల జరుగుబాటుకు పైకం ఇవ్వగలను,"

“ఊరికెనే మీ దగ్గిర పైకం తీసుకోవాలని లేదండి. మీ సేవకుడికి సేవకురాలిలా ఉంటాను."

"మీరు శలవు తీసుకోవచ్చు,"

బిక్షానికి వచ్చి వేయబోతే దాన్ని నిరాకరించిన మనిషిలా తోచి అతనికి కోపం వచ్చింది.

ఆమె సాలోచనగా లేచి, వస్తానని, నమస్కారం అని మెట్లు దిగింది. తాను కూర్చున్న చోట నిలబడ్డాడు, తెరను తాను కనబడకుండా ఉండేంత మేరకు లాగి. ఆమె గేట్ చేరడానికి అరనిమిషం చాలు, రెండు నిమిషాల తరువాత గేట్ తీసి తానే గడియ వేసి వెళ్లిపోవడం చూశాడు. బాలయ్య వచ్చి ఒక కాగితం ఇచ్చాడు. అది మడతవిప్పి దాంట్లోకి చూస్తూ నిలబడ్డాడు.

రెండు రోజులు ఆలోచించాడు. మరో వ్యక్తితో సంబంధం ఒద్దనుకున్ననిర్ణయం సడలింది. అవతలి వ్యక్తి దాన్ని ఒక సహాయంగా భావిస్తున్నపుడు ఆ "సహాయం" చేయడం, ఉభయులూ లాభపడటం పనికిమాలిన విషయం కాదు. మనసును పాషాణంగా మార్చుకోగల శక్తి ఉండుంటే ఆ పని చేసే ప్రయత్నానికి పూనుకునే వాడేనేమో. ఆమెకు పుస్తె కట్టబోవడంలేదు, రిజిస్టర్ పెళ్లి చేసుకోబోవడంలేదు.

"ఆమెకు కబురుపెట్ట రా," అన్నాడు బాలయ్యతో.

భ్రమరాంబ తిరిగి వచ్చింది బాలయ్య వెళ్లి పిలవగా. ఆమె గతంలో చెప్పినదానికి కొనసాగింపుగా ఏదేదో మాట్లాడింది.

"ఆ కాగితం ముక్క మీద 'మనసు మార్చుకుంటే, రమ్మనరూ?' అని రాసి మీ చిరునామా ఇచ్చారు. నేను మనసు మార్చుకుంటానని మీరు ఎందుకనుకున్నారో నాకు తెలియదు. దేని మీద మీకున్న విశ్వాసం అలా అనిపించిందో!"

మీ శరీరం మీదా, నా మంచితనం మీదా అని అతని భావం.

"మీ కారణం ఏదైనా నాకు మేలు జరుగుతుంది. మీరు ఏ షరతుపెట్టినా దానికి తల ఒంచుతాను. నా నిస్సహాయత వలన అలా చేయ వలసి వస్తోందని నేను పూర్తిగా భావించడం లేదు. మీ మీద నాకు ఏ హక్కూ లేదు; నేను మీ పంచనున్నంత కాలం మీకు నా పై సర్వ హక్కులూ ఉన్నాయి. నేను కాగితం మీద స్వ దస్తూరితో రాసి సంతకం చేసి ఇవ్వగలను."

వరండాలో టీపాయి మీది కాగితం, పెన్ను తీసుకుని నాలుగు వాక్యాలు రాసి అక్కడే కాగితం ఉంచి దాని మీద బరువు పెట్టి వెనక్కొచ్చింది.

అతని కన్నా  కనీసం ఒక అంగుళం అధిక పొడవుగాను, గతంలో ఆమె వస్త్రాదయినట్టు కనిపించింది. ఒక ఆసక్తికరమైన జీవిత పుటను తను చదవడానికి ఆమె స్వహస్తాలతో తెరవబోతోందేమో!

" నాకన్నా తెలివైన వాళ్లంటే నాకు కాస్త భయం; నాకన్నా తెలివితక్కువ వాళ్లంటే చిన్నచూపు. మీరు నా పట్ల ఎలాంటి కృతజ్ఞతా భావంతో ఉండక్కర్లా. ఒక వ్యాపారస్థుడి పట్ల అలాంటి భావాన్ని మనం కలిగి ఉండం; నేనూ మీ పట్ల అలాగే ఉంటా. నేను మిమ్మల్ని ఏ కారణం చూపకుండా వెళ్ళిపోమనగానే ఒకరికి ఒకరం ఏమీ బాకీ ఉండం."

"మీరు విరాగి. అందుకే నిర్మోహమాటంగా మాట్లాడగలుగుతున్నారు, ఈ ఒంటరి జీవితాన్ని సాగించగలుగుతున్నారు."

"నేను దంబాచారిని!"

"మీరు సత్యవాది."

"నేను అసత్యవాదిని కూడా!"

ఆమె పవిట కొంగు సడలేలా నవ్వింది ఏదో సత్యాన్ని, తాయిలాన్నీసూచిస్తున్నట్టు. ఆ రెండింటి మధ్య  హృదయం ఉంటుంది అదృశ్యంగా.

“నేను తాబేలు లాంటి వాడిని. నాపై ఏ తడి అంటదు.”

"మీది అరుదైన వ్యక్తిత్వం. "

“ఉలిపికట్టెను!"

పైట సడలకుండా, దంతాలు కనబడకుండా నవ్వింది.

ఆమెను మీద కింద పోర్షన్ లో  బాలయ్య గదికి చేరువగా ఉండమన్నాడు. అవీ ఇవీ ఆమెకు అవసరమైన వాటిని కొనుక్కోడానికి డబ్బిచ్చాడు. పైకొచ్చి అతనికి అన్ని సదుపాయాలూ అమరుస్తోంది. అతను పలకరిస్తే సమాధానం చెబుతుంటుంది. తనంతట తాను మాట్లాడటం అరుదు. బాలయ్య చేస్తూ వచ్చిన పనులలో ఇప్పుడు ఆమె కొన్నిబదిలీ అయ్యాయి; ముఖ్యంగా వంట.

మూడు నాలుగు నెలలకు టైఫాయిడ్ వచ్చి నెల రోజులు మంచమెక్కాడు. కొన్నిసార్లు రాత్రంతా ఆమె కాపలా ఉంది.

"మిమ్మల్నిచూసుకోవలసిన బాధ్యత నాకుంది మీ తిండి తింటున్నంత కాలం.”

"నా తిండి తినడం మానేసిన తరువాత ఎలాగూ వీలవదు."

జ్వరంలో ఆమె అతన్ని నుదిటి మీద ముద్దు పెట్టుకుంది. అది అతనికి నచ్చలేదు. అది కామపు ముద్దని భావించి ఉండొచ్చు. శరీరం కాలిపోతుండేది. "చావను కదా?" అనుకున్నాడు. తాను చావడం అనే ఉపకారం ఆమెకు జరుగుతుందని ఆమె అనుకున్నట్టు "చావను" అని చెబుతున్నట్టు రెప్పలు ఎత్తి ఎర్రటి కళ్ళతో చూశాడు. అతనికి ఆమె చేయని సేవలేదు పట్టుకుని నడిపించడం వరకు. అలా ఆమె తనకు సేవలు చెయ్యడం అతనికి ఇష్టం లేదు – ఇరువురూ ఒకరికొకరు దగ్గరవుతారేమోనని. నర్సును మాట్లాడమని బాలయ్యతో అన్నాడు. ఆమె బలవంతాన వారించింది సదావకాశాన్ని ఒదులుకోదలచనట్టు. కొన్ని అనూహ్యంగా జరుగుతాయి, ఇష్టంలేనివి జరుగుతాయి, భరించక తప్పదు అని అనుకున్నాడు.

"కిందెందుకూ? పైనే ఉండండండి; ఉన్న మూడు గదుల్లో ఒక దాంట్లో. నాకు ఒకటి చాలు. మరో రెండు ఊరికే పడి ఉంటాయి. ఈ ఇల్లు కొన్నది." అన్నాడు జ్వరంతో మూలుగుతూ రెండోరోజు. ఆ పని చేసింది.

సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు.'దగ్గిరయ్యింది,' అనుకున్నాడు. అతనికి అతని మీద నమ్మకం సడలలేదు.

ఒక అర్ధరాత్రి ఆమె తలుపు కొట్టాడు. ఎదురు చూస్తున్నట్టు తలుపు తీసింది. బెడ్ లైట్ వెలుగుతోంది. అతనెళ్ళి ఆమె మంచం మీద కూర్చున్నాడు. మంచం పక్క బల్ల మీద మల్లెలు చిన్న పోగుగా పోసున్నాయి ఎదురుచూస్తున్నట్టు. గదంతా వాటి వాసన. రోజు సాయంత్రం ఆమె కొన్ని మల్లెలు కోసి ఆ బల్ల మీద పోస్తుంటుంది. జుట్టులో పెట్టుకోదు.

"కూర్చోండి," అన్నాడు.

"నిద్రపట్టలేదా?" అడిగింది.

"సిగ్గా?" అడిగాడు అది ఉందొ లేదో అన్న అనుమానమున్నట్టు.

"చూశారు కదా ముడి విప్పిన లంగా జారి సిగ్గులా కుప్పకూలడం! నేను నైతికత కుబుసం విడిచిన కోరలులేని పడగ కూడా విప్పలేని సర్పాన్ని."

"కవిత బావుంది. బుసకూడా కొట్టలేరేమో!"

"మునీ, పాము కథ తెలుసుగదా? ఆ పనీ చేయలేకపోతే భయం లేక పురుగులా హింసిస్తారు."

"ఆ విధంగా మాట్లాడటం సాధన చేశారా?'

"మీరే అన్నట్లు అసహజత్వం సహజత్వంగా మారుతుంటుంది."

బెడ్ లైటును ఆర్పేసింది.

"ఏం?"

"నాకు నేను కనబడకుండా ఉండటానికి,"

"మీరు నాకూ కనబడరు."

"మీకూ నేను కనబడకపోతేనేం,"

గోబ్లిట్ మనసులో నిలుచుని వుంది.

మంచంచేరిన ఆమె కళ్ళు మూతలుపడ్డాయి. ఆమె జడను గుప్పిట్లో ఉంచుకుని ఆసాంతం గుప్పెటను పోనిచ్చాడు. తనలోని ఏది బతుకుతెరువుకు తనవంతు దోహదంచేసిందో చెప్పడం కష్టం అనుకుంది. అతని మొహాన్ని ఆమె అరిపాదాలు చూస్తున్నాయి.

అతను లేచిపోయాడు. బెడ్ లైట్ వేసింది.

"తుమ్మెదలను సృష్టించి ఈ రాక్షసుడిని సంహరింప చేయరుకదా?"

"రాక్షసుడిని అని చెప్పుకుంటున్నాయన మీద భుక్తికి ఆధారపడి ఉన్నాను కదా!"

అతను కోలుకున్నకొన్ని నెలలకు ఆమె వాంతులుచేసుకుని సొమ్మసిల్లి పడిపోయింది. బాలయ్యకు చెప్పి అంబులెన్సు పిలిపించి ఆస్పత్రిలో చేర్పించాడు. నెలరోజులకు కోలుకుంది. మరో రోజులు ఆస్పత్రిలోనే వుండే ఏర్పాటు చేశాడు డబ్బు ఖర్చయితే అయిందని. ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె జుట్టంతా ఊడి పోయింది.

ఆమె పలకరించినా సరిగ్గా మాట్లాడేవాడు కాదు ఒక నిర్ణయానికి వచ్చనట్టు.

"పంపించేస్తారా?" అడిగింది చేయి పట్టుకుని

"నాకే తెలీదు."

ఆమె కన్నీరు కార్చింది. అతను తల తిప్పుకున్నాడు. మనకు దిటవు చేసుకోడానికి ప్రయత్నం ఆరంభించింది.

"దీనితో అనుబంధం ఏర్పడుతోందా?"

సరిగ్గా నెలరోజులు గడిచాయి.

"ఎందుకో ఒంటరి జీవితాన్ని నా మనసు తిరిగి గాఢంగా కోరుకుంటోంది. ఒంటరిదనం నా అర్ధాంగి. పుస్తె కట్టని అర్థాంగి అర్థాన్గే కదా. నా గత జీవితమే నాకు తిరిగి సరిగ్గా సరిపోతుంది. మీకు డబ్బు ఇద్దా మనుకుంటున్నా."

అప్పుడే భోజనం ముగించుకుని తాంబూలం సేవిస్తున్నది. అతని వైపు చిరునవ్వుతో చూసింది నమిలిన తాంబూలాన్ని ఒక బుగ్గకు తోస్తూ–

"మన ఒప్పందం ప్రకారం కారణం అడగను, రేపు మంచి రోజు," అంది ఎర్రటి పెదవులతో.

అతను మాట్లడలేదు. తాంబూలం ఘాటువల్లనేమో ఆమె కళ్ళు తడితో మిలమిలలాడాయి.

"వారం ఆగి వెళ్లినా నాకు అభ్యంతరం లేదు."

"మీది దయార్ద్ర హృదయం."

మరుసటి రోజు తన సామాను సర్దుకుని, సూటుకేసు పట్టుకుని వచ్చి డ్రాయింగ్ రూంలో అతన్ని అనుకుని కూర్చుంది. మాట్లాడకుండా ఐదు నిమిషాలు గడిపారు. లేచి నిలబడి, ఇక పవిత్రంగా జీవించ దలచినట్లు భుజాలనూ వీపునూ పవిట కొొంగుతో కప్పుకుంది.

"నేను తామరపాకును. నాపై నీటి బొట్టుకు స్థానం లేదు."

"తామరపాకులోన తేమ ఉండకపోదు. నేను నీటిబొట్టును, కన్నీటిబొట్టును; రాలిపోతున్నా. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ ఒక విషయం మిమ్మల్ని అడిగే సాహసం చేద్దామనుకుంటున్నా."

"సమాధానం చెబితే చెబుతా, లేకపోతె లేదు."

"జీవితంపట్ల మీది తాత్త్విక ధోరణి అనుకుంటున్నారా?"

"లేదు! మనిషి మౌలిక స్వభావం మనసు గుప్పిటిలో లేదు. జీవితంపట్ల, మనుషులపట్ల నాకు భయం, అసహ్యం. మనుష్యద్వేషి అనుకున్నా నేనేమీ అనుకోను."

"మళ్ళీ మనం కలుస్తామేమో."

"ఈ క్షణం నాది కాకపోయినా, ప్రతి మరుక్షణం నాది అన్న ఆశతో జీవించగలగడం అదృష్టం."

మెడమీద ఎవరో చేయివేసి తోస్తున్నట్టు వెళ్ళిపోతోంది. ఆమె ఏదో పరిమళం వదిలి పోతోంది. అది ముక్కుకు సోకకుండా ఊపిరి బిగబట్టాడు. ఒకసారి ఆమె గదిలోకి వెళదామనుకుని మానేశాడు. అది తనను నిందిస్తుందని, అది దాచుకున్నగతం తనను మానసికంగా బంధిస్తుందేమోనని అనిపించింది. వరండాలో నుంచే కింది గేటు కేసి తొంగి చూశాడు.

కేవలం ఆసక్తితోనా?

లోలకంలా ఊగడంలేదు పీలిక జడ, ఉరెయ్యకుండా వొదిలేసిన తాడులా తోచింది. కుబుసం వదిలిన నల్ల పాము నిలువుగా, తోక మీద నడిచి వెళుతున్నట్టుంది. కాకపోతే, ఆమె అన్నట్టు కోరలు లేవు. పామును, ఉరితాడునూ కూడా ఒక్కోసారి ప్రేమించ వచ్చు అందంగా, అవసరార్థంగా ఉన్నపుడు. సముద్రం వైపు మరల్చాడు దృష్టిని. ప్రశాంతతను నటిస్తోంది.

ఇంట్లోకి వడివడిగా వచ్చి బాలయ్య పిలుపు బెల్లు నొక్కాడు.

"వెళ్ళిపోయిందా?"

"పిలవమంటారా?"

"నేను చెప్పలేదుగా?"

తటపాయించి, అతన్ని వెళ్లిపొమ్మని సైగచేసాడు.

బాలయ్యను ఎందుకు పిలిచినట్టు?

COMMENTS